

ప్రజాధనం నీళ్లపాలు..!

- వైసీపీ హయాంలో అంతులేని నిర్లక్ష్యం
- ఆర్వో ప్లాంట్లు పేరుతో.. రూ. కోట్ల ఖర్చు
- పనిచేయని నీటి శుద్ధి యంత్రాలు
- ఇళ్ల నుంచి నీటిని తెచ్చుకుంటున్న విద్యార్థులు

వేసవిలోగా కూటమి ప్రభుత్వం స్పందించేనా?

ఆంధ్రజ్యోతి విజిట్



● ఇక్కడ కనిపిస్తున్నది నంద్యాల మండలం భీమవరం ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ (ఆర్వో ప్లాంట్). గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. మనబడి.. మన భవిష్యత్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. దీంతో నేటికి నిరుపయోగంగా ఉంది. విద్యార్థులు బోరింగ్ నీరు తాగాల్సిన దుస్థితి ఏర్పడింది. అదేవిధంగా పోన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో కూడా వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని ఆర్వో ప్లాంట్లను పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నంద్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో గత వైసీపీ సర్కార్ నాడు- నేడు కింద రూ.కోట్లు ఖర్చు చేసి పలు ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి ఆర్వో ప్లాంట్లును ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వాటి నిర్వాహణను గాలికి వదిలేసింది. ఖరీదైన పరికరాలు సైతం మరమ్మతులకు చేరి నిరూపయోగంగా మారాయి. తద్వారా ఆయా పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఓ మూలకు చేరి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇక విద్యార్థులు చేసేదేమీ లేక ఇళ్ల నుంచి బాటిళ్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో చేతిబోరు నీటినే తాగాల్సిన గత్యంతర పరిస్థితి ఏర్పడింది. ఆర్వో ప్లాంట్లు నిర్వహణపై గత ప్రభుత్వ తీరు మూన్నాళ్ల ముచ్చగానే మారింది. గత వైసీపీ పాలకుల నిర్వాకంతో.. విద్యార్థులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమైంది. ఈ క్రమంలో వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, కళాశాలల్లో ఆర్వో ప్లాంట్లను మరమ్మతులు చేసి వినియోగం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.



మూలకు చేరిన రుద్రవరం మండలంలోని పేరూరు ప్రాథమిక పాఠశాలలోని ఆర్వో ప్లాంట్



● జోన్ నియోజకవర్గం ప్యాపిలి మండల పరిధిలోని గుడిపాడు ప్రాథమిక పాఠశాలలో ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు చేరి నిరూపయోగంగా దర్శనమిస్తోంది. ఇక్కడ 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఆర్వో ప్లాంట్ ఉన్నా.. పనిచేయకపోవడంతో ఇంటి వద్ద నుంచి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి. ప్యాపిలి మండల పరిధిలో నాడు- నేడు కింద గత ప్రభుత్వం 30 పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో సగానికి పైగా పనిచేయడం లేదు. దీంతో ఏళ్ల తరబడి విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

● ఏళ్ల తరబడి మూలనపడ్డ ఆర్వో ప్లాంట్లు

గత జగన్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు నాణ్యాతలోపంగా ఉండటంతో ఎక్కువ కాలంలో పనిచేయలేదు. 70 శాతం పనిచేయకపోవడంతో పలుమార్లు ఆయా ఏజెన్సీలతో పాటు అధికారులకు సంబంధిత యాప్ ద్వారా ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. చివరికి విద్యార్థుల కష్టాలు చూడలేక.. కొందరు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులే మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెచ్చారు. మరికొన్ని ఏజెన్సీలకు ఇప్పటికీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా సర్వీసింగ్ చేయడం లేదు.



నంద్యాల జిల్లా వ్యాప్తంగా 1,352 ప్రభుత్వ పాఠశాలల్లో 1,45,517మంది విద్యను అభ్యసిస్తున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు లేక అనేక అవస్థలు పడుతున్నారు. ఎక్కువ శాతం ఆర్వో ప్లాంట్‌లు కూడా పనిచేయకపోవడంతో దిక్కులేక.. కొళాయి నీరు, చేతిపంపులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మరీ దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. అపరిశుభ్రత ప్రాంతాల్లో ఉండే కలుషిత నీరు ను తాగాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించాలని సుమారు రూ.3 కోట్లకు పైగా నాడు- నేడు కింద ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్లును ఏర్పాటు చేసి మమ అనిపించేశారు. కానీ ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో పెట్టలేకపోయింది. ఎక్కడ చూసినా ఆర్వో ప్లాంట్లు మరమ్మతులకు చేరి పనికిరాకుండా పోయాయి. అధికారిక లెక్కల ప్రకారం.. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 357 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం 177 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగిలిన 180 మాత్రం ఏళ్ల తరబడి పనిచేయడం లేదని అధికార లెక్కలు చెబుతుండటం పలు విమర్శలకు తావిస్తోంది.


మిగతా 6వ పేజీలో

జిల్లా వ్యాప్తంగా వివరాలివి...

● ప్రైమరీ పాఠశాల సంఖ్య	969
● విద్యార్థుల సంఖ్య	41,640
● ప్రాథమిక పాఠశాలలు	104
● విద్యార్థుల సంఖ్య	10,945
● హైస్కూల్స్	279
● విద్యార్థుల సంఖ్య	92,932
● జిల్లాలో ఆర్వో ప్లాంట్లు అమర్చిన పాఠశాలల సంఖ్య	357
● ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్వో ప్లాంట్లు	177
● పనిచేయని ఆర్వో ప్లాంట్లు	180

దేవతలారా రండి..

- శ్రీగిరిపై బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- వైభవంగా ధ్వజారోహణ
- శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ
- నేడు స్వామి, అమ్మవార్లకు భృంగివాహన సేవ



ప్రధాన ఆలయంలో ధ్వజపటం ఆవిష్కరణ

శ్రీశైలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం యాగశాల ప్రవేశంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు మార్చి 1న ముగియనున్నాయి. బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆగమశాస్త్రానుసారం బ్రహ్మోత్సవ ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు చతుర్వేదపారాయణలు చేసి వేదస్వస్తి నిర్వహించి శివసంకల్పం చేశారు. బ్రహ్మోత్సవాల సృష్టికర్త బ్రహ్మాదేవుని ఆధ్వర్యంలో, క్షేత్రపాలకుడైన వీరభద్రస్వామి పర్యవేక్షణలో, శివ పరివార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి ప్రతేకంగా పూజాధికాలు జరిపారు. ఉత్సవాలను తెలియజేసేలా ప్రధాన ధ్వజస్తంభం వద్ద ప్రతేక పూజలు నిర్వహించి ధ్వజపటాన్ని ఆవిష్కరించారు. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ధ్వజారోహణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. అలాగే గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ 26వ తేదీన స్వామి,అమ్మవార్ల దర్శనార్థం వస్తున్నట్లు తెలిపారు.

మిగతా 6వ పేజీలో...

ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్స్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 10వతేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మొత్తం 34,365 మంది విద్యార్థులకు గాను 33,297 మంది హాజరయ్యారు. 1,068 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయన్నారు.

రైతులకు ఊరట..!

- 19వ విడత కింద జిల్లాకు నిధులు విడుదల
- 1.98 లక్షల మంది రైతులకు రూ.39.51 కోట్లు

నంద్యాల, ఫిబ్రవరి19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు తీపి కబురు తెలిపింది. వ్యవసాయదారులకు అందించే ఆర్థిక పెట్టుబడి సాయం 2024-25 19వ విడత కింద రూ.840.95 కోట్లు విడుదల చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రైతులకు ఊరట కలిగినట్లయింది. ఈ క్రమంలో జిల్లా పరంగా పరిశీలిస్తే 1.98 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.39.51 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే ఆయా రైతుల బ్యాంకు ఖాతాలకు ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జమ కానుంది. గతంలో 17,18వ విడత కింద రూ.79.20 కోట్లు ఆయా రైతుల ఖాతాలకు జమ చేసిన విషయం తెలిసిందే.

టమోటా ధర పతనం

- దిగుబడి కూడా తగ్గిన వైనం
- 25 కిలోల బాక్సు రూ.150 మాత్రమే

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : గిట్టుబాటు ధర లేక మిర్చి రైతులు కన్నీరు కార్చారు.. ఇప్పుడు టమోటా రైతుల వంతు వచ్చింది. సరిగ్గా 6 నెలల క్రితం టమోటాల ధర కిలో వంద రూపాయలు దాటింది. అలాంటిది ఇప్పుడు పూర్తిగా పడిపోయింది. నిన్న మొన్నటి వరకు 25 కిలోల టమోటా బాక్సు రూ.400, 500 పలికింది. ఇప్పుడు కనీసం రూ.150 మించలేదు. ఎకరాకు 600 బాక్సుల దిగుబడి రావాల్సిన దిగుబడి 300 బాక్సులకు పడిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరం టమోటా సాగుకు సుమారు రూ.25 వేల దాకా ఖర్చు అవుతోంది. ధర చూస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరో వైపు బహిరంగ మార్కెట్లో టమోటా ధర కిలో రూ.15కు పైగా పలుకుతోంది. రైతుకు మాత్రం కిలో టమోటా కేవలం రూ.5 నుండి రూ.6 మాత్రమే చేతికి వస్తోంది. రోజు రోజుకూ ధర తగ్గుతుండటంతో టమోటా రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



కొలిమిగుండ్ల మండలం కోటపాడులో సాగు చేసిన టమోట

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్పీ

శ్రీశైలం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన నేపథ్యంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు లక్షలాదిగా భక్తులు తరలివస్తారు. దీంతో ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, రాజగోపురం పరిసర ప్రాంతాలు, కమాండ్ కంట్రోల్ రూమ్, లడ్డు విక్రయ కేంద్రాలను ఆయన పరిశీలించారు. శ్రీశైలం డ్యామ్ సమీపంలోని ఘాట్ రోడ్‌ను పరిశీలించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖను ఆదేశించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐలు జి.ప్రసాదరావు, మోహన్‌రెడ్డి, చంద్రబాబు, సురేష్ కుమార్‌రెడ్డి, ఆలయ ఈఈ మురళీ బాలకృష్ణ ఉన్నారు.

పశు బీమా పథకానికి రూ.12 లక్షలు సబ్సిడీ



నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో పశుబీమా పథకంలో భాగంగా ప్రభుత్వ సబ్సిడీ రూ.12లక్షలు మంజూరైనట్లు పశుసంవర్ధకశాఖ జేడీ గోవింద్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో యునైటెడ్ ఇన్సూరెన్స్ పథకం ద్వారా పశువులకు బీమా కల్పించడం జరుగుతోందన్నారు. రూ.15వేలు బీమాకు ప్రీమియం రూ.960 కాగా ప్రభుత్వం సబ్సిడీగా రూ.768, రైతు వాటాగా రూ.199 చెల్లించాలన్నారు. అలాగే రూ.30వేల బీమాకు రూ.1,920ు ప్రీమియం కాగా రూ.1,536 ప్రభుత్వం సబ్సిడీగా చెల్లింపు, రైతు వాటాగా రూ.398 చెల్లించాలన్నారు. రూ.40వేలు బీమా చేస్తే ప్రభుత్వం రూ.1,536 , రైతువాటాగా రూ.1,392 చెల్లించాలి. రూ.50వేలు బీమా చేస్తే ప్రభుత్వం రూ.1,536, రైతు రూ.1723లు చెల్లించాలని వివరించారు. ఒకసారి బీమా చేస్తే మూడేళ్ల వరకు వర్తిస్తుందన్నారు.

సదరన్ సర్టిఫికెట్లలో విచిత్రాలు

- కాలు చేయి లేని వ్యక్తికి కంటిచూపు లేదని ధ్రువీకరణ పత్రం
- వెరిఫికేషన్‌లో బయట పడుతున్న అవకతవకలు

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లలో అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక సదరన్ క్యాంపులు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వెరిఫికేషన్ కోసం వికలాంగులు తమ మండల పరిషత్ కార్యాలయాల నుంచి నోటీసులు తీసుకుని సరిచూసుకుంటున్నారు. అయితే క్యాంపుకు వచ్చిన వికలాంగుల పత్రాలు చూసి సిబ్బంది అవాక్కయ్యారు. కాలు, చెయ్యి లేదని గతంలో సదరన్ క్యాంపుకు రాగా ఏకంగా ఆ వికలాంగుడిని గుడ్డి వారిని చేశారు. సదరం సర్టిఫికెట్‌లో కంటిచూపు లేదని ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. ఆ వికలాంగుడికి పింఛన్ వస్తున్నప్పటికీ ప్రస్తుత వెరిఫికేషన్‌లో పింఛన్ పోతుందేమో అని ఆందోళనపడుతున్నాడు. మరో వికలాంగుడు సదరం సర్టిఫికెట్‌లో ధ్రువీకరణ పొందినప్పటికీ సచివాలయం నోటీసుతో కంటిచూపు లేదని నమోదు చేశారు. వెరిఫికేషన్‌లో మిస్ మ్యాచింగ్ అని ధ్రువీకరించారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 60కి పైగా ఇలాంటి మిస్ మ్యాచింగ్ బాధితులున్నారు. అధికారులు ఇవన్నీ సరిచేసి న్యాయం చేస్తారా? లేక పింఛన్ తొలగిస్తారా? అని వికలాంగులు భయపడుతున్నారు. వికలాంగులే అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల సదరం క్యాంపుల్లో అస్తవ్యస్తంగా నమోదు చేయడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అవకతవకలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పునః పరిశీలన వల్ల వికలాంగులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. తాము కొన్నేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నామని, ఇప్పుడు వెరిఫికేషన్ చేయడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సదరన్ క్యాంపులో ఇలాంటి విచిత్రాలు ఎన్నో కనిపిస్తుండటంతో ఆసుపత్రి సిబ్బంది అవాక్కవుతున్నారు. వెరిఫికేషన్‌కు హాజరు కాని వికలాంగుల పింఛన్లు నిలిపివేస్తామని నోటీసులో పేర్కొనడంతో వికలాంగులు నానా అవస్థలు పడి వెరిఫికేషన్‌కు హాజరవుతున్నారు.



ప్రభుత్వాసుపత్రిలో సదరన్ క్యాంప్

కాలూ చేయి సరిగా లేకపోతే.. చూపు లేదని ధృవీకరణ పత్రం ఇచ్చారు



ఈ ఫోటోలో కనిపిస్తున్న వికలాంగుడి పేరు గొడుగు ప్రభాకర్. స్వగ్రామం చాగలమర్రి మండలం ముత్యాలపాడు. ఈయనకు ఎడమ చేయి లేదు. కాలు వైకల్యం ఉంది. గతంలో సదరన్ క్యాంపులో దరఖాస్తు చేసుకోగా 90శాతం కంటిచూపు లేదని, 2023 డిసెంబర్ 22వతేదీ అధికారులు గుడ్డిగా ధ్రువీకరణ పత్రం జారీచేశారు.

కంటి చూపు కోసం వెరిఫికేషన్ నోటీసు:



ఈయన పేరు ముల్లాషేక్షావలి. స్వగ్రామం చాగలమర్రి. ఇతనికి గతంలో వికలాంగుడిగా ధ్రువీకరణపత్రం ఉంది. అయితే ప్రస్తుతం మండల పరిషత్ అధికారులు ఈయనకు కంటిచూపు కోసం వెరిఫికేషన్ నోటీసు ఇచ్చారు. ప్రస్తుతం ఈయన దరఖాస్తు మిస్ మ్యాచింగ్‌లో ఉంచారు.

ఆంధ్రజ్యోతి విజిట్

ప్రజాధనం.. నీళ్ల పాలు!

(5వ పేజీ తరువాయి)

మంత్రి బీసీ ఇలాకాలో...



బనగానపల్లి మండలంలో గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో -10, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో-10 చొప్పున మొత్తంగా 20 పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలు, బాలికల ఉన్నత పాఠశాలు, నందవరం నందివర్గం, పలుకూరు రామతీర్థం, ఇల్లూరు కొత్తపేట, టంగుటూరు, బనగానపల్లె మోడల్ స్కూల్, కస్తూర్బా, ఏపీ గురుకుల పాఠశాలలతో పాటు మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లు ఎక్కడా పనిచేయడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోలేదు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు కొళాయినీరు తాగుతుండగా.. మరి కొన్ని పాఠశాలల విద్యార్థులు ఇంటి వద్ద నుంచే తెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గం నుంచి ఎన్నికై మంత్రిగా కొనసాగుతున్న బీసీ జనార్దన్ రెడ్డి చొరవ తీసుకుని తాగునీటి ప్లాంట్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

● మహానంది మండలంలో నాడు-నేడు కింద గత వైసీపీ ప్రభుత్వం ఏడు పాఠశాల్లో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. గోపవరం, గాజులపల్లి, బుక్కాపురం, బొల్లాపురం ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్లాంట్ గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. చేసేదీ లేక కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. మరికొందరు బయట ప్రాంతాల్లో కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు. అధికార లెక్కల ప్రకారం ఏడు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయగా.. వాటిలో నాలుగు మరమ్మతులకు చేరాయి.



● బండి ఆత్మకూరు మండలం పరిధిలో 9 ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఆయితే ఆ మిషన్లు ఎక్కువ కాలం పనిచేయకపోవడంతో మరమ్మతులకు చేరాయి. మండలంలోని పార్నపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 74 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ తాగునీటి వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటుండగా.. కొన్ని సార్లు ప్లాస్టిక్ బిందెలతో తాగునీరు అందిస్తున్నారు. మిగిలిన 8 పాఠశాలల్లో కూడా సదరు వాటర్ ప్లాంట్‌లు పనిచేయడం లేదు.



● రుద్రవరం మండలం పేరూరు ప్రాథమిక పాఠశాలలో గత మూడేళ్లుగా గత ప్రభుత్వం అమర్చిన తాగునీటి వాటర్ ప్లాంట్ మరమ్మత్తులకు గురై అటకెక్కింది. పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో మూలకు ఉంచారు. ఇక్కడ 61 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల కష్టాలు చూడలేక.. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కలిసి ప్లాస్టిక్ క్యాన్‌లో నీటిని తెచ్చిపెడుతున్నారు. ఇవీ సరిపోక కొందరు ఇళ్ల వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు.





● డోన్ పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 1,747 మంది విద్యార్థులు ఉన్నారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద ఇక్కడ ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. రెండేళ్ల నుంచి పనిచేయకపోవడంతో తాగునీరు లేక.. బోరు నీరు తాగలేక.. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా మరుగుదొడ్డు కూడా సక్రమంగా లేకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంది.



● శ్రీశైలంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గత ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. అయితే గత ఏడాది నుంచి పనిచేయడం లేదు. దీంతో కొందరు విద్యార్థులు ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటుండగా.. మరికొందరు విద్యార్థులు బోరింగ్ నీరు తాగాల్సిన దుస్థితి.



● శిరివెళ్ల మండలం యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 610 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిరోజు 550 మందికిపైగా విద్యార్థులు మధ్యాహ్నం భోజనం ఇక్కడే చేస్తుంటారు. ఏడాది నుంచి ఆర్వో ప్లాంట్ పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు పాఠశాలలోని బోరు నీటినే తాగుతున్నారు. కొందరు విద్యార్థులు బోరు నీరు తాగలేక.. ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం శిరివెళ్ల మండల పరిధిలో 16 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెయిన్ ప్రాథమిక పాఠశాల, గుండంపాడు, మహాదేవపురం మెయిన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయలేదు.

● ఫిర్యాదు చేసినా మెకానిక్ రావడం లేదు



మూడేళ్ల నుంచి జూపాడు బంగ్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎలాంటి నిధులు రాలేదు. ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఏజెన్సీ మెకానిక్ కూడా స్పందించలేదు. చివరికి చేసేది నేనే స్వయంగా రూ.15 వేలు ఖర్చు చేసి ఆర్వో ప్లాంట్‌కు రిపేరీ చేయించాను. ఆ తర్వాత కూడా కొన్ని నెలలు పనిచేసి తర్వాత చెడిపోయింది. దీంతో విద్యార్థులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. మా పరిధిలోని కొన్ని పాఠశాలల్లో కూడా ఇదే తరహా సమస్య ఉండటంతో ఉపాధ్యాయులే డబ్బులు వెచ్చించి చేయించుకునే పరిస్థితి ఏర్పడింది.

- చిన్న మద్దిలేటి, ఎంఈఓ, జూపాడుబంగ్లా

● జూపాడుబంగ్లా మండలంలో నాడు-నేడు కింద గత వైసీపీ ప్రభుత్వం 13 ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. ఆయితే ఒక్కటి కూడా పనిచేయలేదు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలన చేయగా.. ఆర్వో ప్లాంట్‌ను ఓ మూలన పడేశారు. రెండేళ్ల నుంచి పని చేయలేదు. ఇక్కడ 537 మంది విద్యార్థులు ఉన్నారు. దీంతో ట్యాంకు ద్వారా సరఫరా చేసే నీటిని విద్యార్థులు తాగాల్సిన దుస్థితి. కొందరు విద్యార్థులు ట్యాంకు నీళ్లు తాగి.. అనారోగ్యం పాలు కావడంతో కొందరు ఇంటి వద్ద నుంచి తెచ్చుకుంటున్నామని వాపోయారు.



● ఆర్వో ప్లాంట్లు పనిచేయకపోవడం వాస్తవమే



జిల్లాలో చాలా వరకు ఆర్వో ప్లాంట్లు పనిచేయని విషయం వాస్తవమే. ఈ విషయాన్ని ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదించాం. అతి త్వరలోనే ఆర్వో ప్లాంట్లుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తెస్తాం. విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేలా చూస్తాం. సదరు ఏజెన్సీలకు గత ప్రభుత్వం బిల్లులు పెండింగ్‌తో మరమ్మతులు చేయలేదని తెలిసింది.

-ఎస్.ప్రేమంత్‌కుమార్, ఏసీపీ, సమగ్రశిక్ష

అంగన్‌వాడీలకు గుడ్ న్యూస్



గత వైసీపీ పాలనలో రోడ్డెక్కిన అంగన్‌వాడీలు (ఫైల్)

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపునకు ముందుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో తమ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు దాదాపు నెలరోజులపాటు నిరసన కార్యక్రమాలు చేపట్టినా వైసీపీ ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చేందుకు శ్రీకారం చుడుతోంది. అందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు ఉద్యోగ విరమణ చేసినరోజునే గ్రాట్యుటీ చెల్లించాలని నిర్ణయం తీసుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం గ్రాట్యుటీ అమలుపై అడుగులు వేయనుంది. దీనిపై అంగన్‌వాడీలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీల సర్వీసుల ఆధారంగా గ్రాట్యుటీ లెక్కించి ఇవ్వనున్నారు. ఎన్ని సంవత్సరాలు సర్వీస్ ఉంటే అందులో ప్రతి ఏడాదికి 15రోజుల వంతున వేతనం చెల్లిస్తారు. నంద్యాల జిల్లాలో 6 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,663 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో అంగన్‌వాడీ కార్యకర్తలు 1,606, ఆయాలు 1,584 మొత్తం 3,190 మంది పనిచేస్తున్నారు. వీరిలో 20నుంచి 30ఏళ్లుగా పనిచేస్తున్నవారు ఉన్నారు. వీరు అందుకుంటున్న వేతనం ప్రకారం లెక్కిస్తే సరాసరి రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షలకుపైగా గ్రాట్యుటీ అందుకునే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కార్యకర్తలు రూ.11,500, ఆయాలు రూ.7వేలు చొప్పున వేతనాల అందుకుంటున్నారు.

డ్రిప్పు సేద్యం సబ్సిడీ ఖరారు

- ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం
- మిగతా రైతులకు 90 శాతం
- ఉమ్మడి జిల్లాలో 15వేల హెక్టార్లలో డ్రిప్పు ఏర్పాటు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ సాగునీటి పథకం కింద డ్రిప్పు, తుంపర్ల పరికరాలను అమర్చేందుకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం సబ్సిడీని ఖరారు చేసిందని కర్నూలు జిల్లా ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయానికి సంబంధించి వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడిపి రాజశేఖర్ పంపిన ఉత్తర్వులు బుధవారం తమ కార్యాలయానికి అందినట్లు పీడీ తెలిపారు. ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ, సన్న చిన్నకారు రైతులకు వంద శాతం సబ్సిడీపై పరికరాలు అందుతాయన్నారు. దీని వల్ల రైతులందరికీ బోరుబావులు ఉన్న వారికి వంద శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీయేతర సన్న చిన్న కారు రైతులకు 90 శాతం సబ్సిడీ (గరిష్టంగా 2.18 లక్షలు) ఉంటుందని, అదే విదంగా ఉమ్మడి జిల్లాలో 5 నుంచి 10 ఎకరాల్లోపు రైతులతో పాటు గిరిజన ప్రాంతాల్లో ఎస్టీ రైతులకు 90 శాతం సబ్సిడీ (3.14 లక్షలు) ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ పరికరాల కోసం దరఖాస్తు చేసుకునే అన్ని సామాజిక వర్గాలకు చెందిన ఐదెకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు 50 శాతం (రూ.19 వేలు), 12.5 ఎకరాల్లోపు పొలం కలిగిన ఇతర సామాజికవర్గాలకు 50 శాతం చొప్పున సబ్సిడీ ఇవ్వనున్నట్లు పీడీ ఉమాదేవి తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15వేల హెక్టార్లకు డ్రిప్పు పరికరాలను ఈ ఆర్థిక సంవత్సరం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పీడీ తెలిపారు. ప్రస్తుతం భూగర్భజలాలు అడుగంటుతున్న నేపథ్యంలో డ్రిప్పు, తుంపర్ల సేద్యం కలిగిన రైతులకు పంట చేతికొచ్చేవరకు పూర్తి స్థాయిలో నీటిని ఉపయోగించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

విక్రమ సింహపురి వీసీగా నంద్యాల వాసి

● విద్యాభ్యాసం అంతా పాణ్యంలోనే.. ● అల్లం శ్రీనివాసరావు ఎంపికపై హర్షం



పాణ్యం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలోని విక్రమసింహపురి యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా నంద్యాలకు చెందిన అల్లం శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పలువర్సిటీలకు వీసీలను నియమించింది. అందులో విక్రమసింహపురి వర్సిటీకి నంద్యాలకు చెందిన అల్లం వెంకటలక్ష్మమ్మ, వెంకటయ్య కుమారుడు అల్లం శ్రీనివాసరావును ఎంపిక చేశారు. శ్రీనివాసరావు తండ్రి వెంకటయ్య వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు కావడంతో ఆయన నంద్యాల, పాణ్యం ప్రాంతాల్లో పనిచేశారు. అల్లం శ్రీనివాసరావు ఐదో తరగతి పాణ్యం మండలంలోని తమ్మరాజుపల్లెలో చదివారు. అనంతరం 1981-82 పదవ తరగతి పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్తి చేశారు. టి.చంద్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ కోర్సును పూర్తి చేశారు. ఇంటర్ అనంతరం శ్రీనివాసరావు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీలో హెచ్‌ఓడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు 250 అంతర్జాతీయ ప్రచురణలు, 25 మందికి పీహెచ్‌డీలు అందజేశారు. కేఎల్ వర్సిటీలో 15 సంవత్సరాలు, ఢిల్లీలో 13 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. డీటీయూలో ఏడుసార్లు తన పరిశోధనలకు అవార్డు అందుకున్నారు. అమెరికాలోని ప్రఖ్యాత శాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన ప్రపంచ టాప్-2 పర్సెంట్ శాస్త్రవేత్తల జాబితాలో వరుసగా నాలుగోస్థానం దక్కించుకున్నారు. ఢిల్లీ టెక్నలాజికల్ విశ్వ విద్యాలయంలో తన పరిశోధనలకు గాను వరుసగా ఏడుసార్లు కమెండబుల్ రీసెర్చ్ అవార్డును అందుకున్నారు. కేఎల్ వర్సిటీలో ఉత్తమ ప్రొఫెసర్‌గా వరుసగా మూడుసార్లు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు కొలూరుకు చెందిన ఆర్జీఎం కళాశాల ఉద్యోగి సుబ్బరాయుడు, పాణ్యంకు చెందిన తెనాలి మున్సిపల్ కమిషనర్ శేషన్న, కొనిదేడుకు చెందిన వాసవీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ రమణారెడ్డిలు మాట్లాడుతూ తమతో పాటు చదివిన మిత్రుడు సింహపురి యూనివర్సిటీకి వీసీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. శ్రీనివాసరావు చిన్నతనం నుంచే చలాకీగా ఉంటు, విద్యలో అందరికంటే ముందు ఉండేవారన్నారు.

మరింత బాధ్యత పెంచింది : అల్లం శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం నన్ను గుర్తించి వీసీ పదవికి ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. వీసీ పదవి ఎంపికతో తనపై మరింత బాధ్యతలు పెరిగాయి. ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి విక్రమసింహపురి యూనివర్సిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తా. విద్యార్థుల ఇబ్బందులను పరిష్కరించి, వారికి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తా.

అరసం పుస్తక సంకలనాలకు

కథలు, కవితల ఆహ్వానం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ రచయిత సంఘం (అరసం) జిల్లా శాఖ కథలు, కవితలకు ఆహ్వానం పలుకుతోంది. ఔత్సాహిక సాహితీవేత్తలను ప్రోత్సహించే క్రమంలో అరసం ముద్రించనున్న 'కర్నూలు కవిత-2', 'కర్నూలు కథలు' పుస్తక సంకలనాలకు జిల్లాకు చెందిన కవులు, రచయితల నుంచి కవితలు, కథలు ఆహ్వానిస్తున్నట్లు గౌరవ సలహాదారు డాక్టర్ ఎం.హరికిషన్, నగర అధ్యక్ష కార్యదర్శులు రాణి లీలావతి, జీవీ ప్రమోద్ చక్రవర్తి ఓ ప్రకటనలో తెలిపారు. రచనలు సామాజిక అంశాలను ప్రతిబింబించేలా ఉండాలని, కులాలను, మతాలను విమర్శించకుండా అభ్యుదయ కోణాన్ని తెలియజేసే విధంగా ఉండాలని తెలిపారు. కవితలు, కథలు గతంలో ఇతర పత్రికల్లో ప్రచురితం కాలేదని, అలాగే ప్రసార సాధనాల్లో రాలేదని హామీపత్రంతో తమ రచనలు పంపుకోవాలని వారు సూచించారు. కవితలు 25 లైన్లకు మించకుండా ఉండాలని, కథలు ఐదు పేజీలకు మించకుండా రాయాలని తెలిపారు. కథలు, కవితలు డాక్టర్ ఎం.హరికిషన్ సెల్ నెంబరు 94410 32212, రాణి లీలావతి సెల్ నెంబరు 7013114708లకు వాట్సాప్ ద్వారా పంపించాలని తెలిపారు. కవులు, రచయితులు తమ కథలు, కవితలను 2025 మార్చి 15లోగా పంపాలని అరసం కార్యదర్శి జీవీ ప్రమోద్ చక్రవర్తి తెలిపారు.



స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న శ్రీకాళహస్తి డిప్యూటీ ఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు



క్యూలైన్‌లో భక్తుల రద్దీ

దేవతలారా రండి..

(5వ పేజీ తరువాయి)



శ్రీకాళహస్తి నుంచి పట్టువస్త్రాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు బుధవారం రాత్రి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి దేవస్థానం పట్టువస్త్రాలను సమర్పించింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో ఎస్.ఆర్.కృష్ణారెడ్డి, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్ పట్టువస్త్రాలను అందజేశారు. ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ఈవో ఎం.శ్రీనివాసరావు, అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో సంప్రదాయ నృత్యప్రదర్శన, వేనుగాణం, భక్త మార్కండేయ నాటకం కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

నేడు భృంగివాహన సేవ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామి, అమ్మవార్లు భృంగివాహనంపై భక్తులకు దర్శనమిస్తారు.

మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

- 25 నుంచి మార్చి 2 వరకు వేడుకలు: మల్లెల రాజశేఖర్



కాల్వబుగ్గలో కోనేటిని పరిశీలిస్తున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ అన్నారు. బుధవారం కాల్వబుగ్గ రామేశ్వరస్వామి మహాశివరాత్రి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. రెండు కోనేరులను బోరు నీటి ద్వారా నింపామన్నారు. మహిళలకు స్నానపు ఘట్టాలు ఏర్పాటు చేశామన్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఎండలు దృష్టిలో పెట్టుకుని ఆలయ ప్రాంగణంతో టెంట్లతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, 30వేల మజ్జిగ ప్యాకెట్లు, 30వేల వాటర్ ప్యాకెట్లు భక్తులకు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటిసేని నారాయణ, కాకి దేవేంద్ర, భక్తులు బజారు, గువ్వ రవికుమార్, వేణు, చిన్న నాగరాజు, మాజీ ఎంపీటీసీ నాగరాజు పాల్గొన్నారు.

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.29 కోట్లు



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మంత్రాలయం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,29,15,105లు వచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, సురేష్ కోనాపూర్ తెలిపారు. జనవరి, ఫిబ్రవరి నెలలో 28 రోజుల హుండీని మఠం గురురాజాంగణ భవనంలో బుధవారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రత, సీసీ కెమెరాల నిఘాలో లెక్కించినట్లు తెలిపారు. రూ.3,29,15,105 నగదుతో పాటు 1280 గ్రాముల వెండి, 58.150 గ్రాములు బంగారు, వివిధ దేశాల డాలర్లు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేసినట్లు తెలిపారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, జేపీస్వామి, రవిస్వామి, కృష్ణమూర్తి, దేశాయ్ నరసింహమూర్తి, గిరిధర్ పాల్గొన్నారు.

ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల్లో గందరగోళం

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పని చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ, హెల్త్ కార్యదర్శులు పదోన్నతుల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఈ నెల 17వ తేదీ అధికారులు ఏఎన్ఎం గ్రేడ్-3 పదోన్నతుల ఖాళీల జాబితాను విడుదల చేశారు. కర్నూలు జిల్లాలో దాదాపు 100 ఖాళీలు ఉన్నట్లు జాబితా విడుదల చేశారు. ఈ జాబితాలో పూర్తి స్థాయి వెకెన్సీలను చూపించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత రోజుల క్రితం కొందరు ఏఎన్ఎంలు నేరుగా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కర్నూలు సమీపంలోని లద్దగిరి పీహెచ్‌సీలోని అమడకుంట్ల, లద్దగిరి గోనెగండ్ల పీహెచ్‌సీలోని హెచ్.కైరవాడి, వెలుగోడు, గోనెగండ్ల, పోలకల్ పీహెచ్‌సీలోని నాగలాపురం గుడిపాడు, జులేకల్, కల్లూరు పీహెచ్‌సీలో సల్కాపురం, బొల్లవరంతో పాటు ధైవందిన్నె పీహెచ్‌సీలో ఎర్రకోట, నందవరం పీహెచ్‌సీలో ముగతి, దేవనకొండ పీహెచ్‌సీలో కొన్ని చూపించలేదని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఖాళీల వివరాలను స్పష్టత ఇస్తూ ప్రకటన చేయాలని కోరుతూ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. పొజిషన్ ఐడీ లేనందు వల్ల వాటిని పూర్తి చేస్తే జీతాలు రావని, అలాంటి సమస్యలు ఉంటే సంబంధిత మెడికల్ ఆఫీసర్ల ద్వారా పంపించాలని ఉన్నతాధికారులు తెలిపారు.

లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉంది

- రూ.12 వేలు చెల్లిస్తే ప్రభుత్వం స్కూటర్ ఇస్తుంది
- దివ్యాంగులను మోసం చేసిన ఓ మహిళ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న దివ్యాంగులు

మద్దికెర, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారుల జాబితాలో మీ పేరు ఉందని, రూ.12 వేలు చెల్లిస్తే రూ.80 వేలు విలువ చేసే స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తుందని చెప్పి ఓ మహిళ దివ్యాంగులను బురిడీ కొట్టించింది. ఈ ఘటన మద్దికెర మండలంలో జరిగింది. వివరాలివి.. ఓ మహిళ 9052126738 నెంబర్ నుంచి రామకృష్ణ, శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మిలతో పాటు మరో 8 మందికి ఫోన్ చేసింది. ప్రభుత్వం స్కూటర్ ఇస్తుందని, రూ.12 వేలు చెల్లిస్తే రూ.80వేలు విలువ చేసే ద్విచక్రవాహనం అందజేస్తారని చెప్పారు. చెప్పిన మొత్తం చెల్లించకపోతే ఇతరులకు మంజూరవుతాయని చెప్పారు. దీంతో ఈ నెల 18న ఒకరు రూ.6,300, మరొకరు రూ.6,300, మరొకరు రూ.10వేలు... బుధవారం ఒకరు రూ.3వేలు, మరొకరు రూ.3వేలు 9642076467, 6364506562 నెంబర్లకు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించారు. అనంతరం సరిగా స్పందన లేకపోవడంతో మోసపోయామని భావించిన దివ్యాంగులు బుధవారం ఎస్ఐ విజయకుమార్ నాయక్‌ను ఆశ్రయించారు. విభిన్న ప్రతిభావంతుల నాయకులు వీరాంజనేయులు, అంజనేయులు, మల్లికార్జున, ప్రసన్నరాణి, తదితరులు ఉన్నారు.

ఆలయ ఉద్యోగికి మెమో

మహానంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో విధులు నిర్వహించే జూనియర్ అసిస్టెంట్ అనూరాధ విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో బుధవారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి మెమో జారీ చేశారు. ఇటీవల ఆ ఉద్యోగిని విధులు నిర్వహించే ప్రసాదాల విక్రయ కేంద్రం వద్ద తనతో పాటు నిబంధనలకు విరుద్ధంగా కుమారుడు విధులు నిర్వహించడంపై పలు పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ఈవో ఆ ఉద్యోగికి మెమో జారీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గడివేముల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిమద్దెల గ్రామ సమీపంలోని కేసీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలివీ.. 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి ఐదారు రోజుల క్రితం కిందట మృతి చెంది ఉండవచ్చని తెలిపారు. మృతుడి కుడిచేతి మీద తెలుగులో వెంకటేశ్వర్లు అనే పచ్చబొట్టు ఉందని, ఒంటిపై బ్రౌన్‌కలర్ టీషర్టు, బ్లూకలర్ షార్ట్ ఉన్నట్లు ఆయన తెలిపారు. కరిమద్దెల వీఆర్వో సయ్యద్ చిన్న ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు గడివేముల పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

రాయలసీమ వర్సిటీలో మార్పులు తీసుకొస్తా

- ప్రతి ఫ్యాకల్టీలో బోధనకు ప్రాధాన్యం
- ఆర్‌యూ కొత్త వీసీగా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ వి. వెంకట బసవరావు





బాధ్యతలు స్వీకరిస్తున్న వెంకట బసవరావు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచనల మేరకు రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి పరిచే క్రమంలో సమూల మార్పులు తీసుకొస్తానని ఉపకులపతి వి.వెంకట బసవరావు అన్నారు. బాధ్యతలు ఇచ్చేముందు ప్రత్యేకంగా కొన్ని టార్గెట్స్ సూచించి ఇక్కడికి పంపారని అన్నారు. ఆ దిశగా పని చేసేందుకు ఒక ప్రణాళిక రూపొందించుకున్నా అని అన్నారు. బుధవారం వీసీగా బాధ్యతలు తీసుకున్న ఆయన ఆంధ్రజ్యోతితో కాసేపు ముచ్చటించారు.

ఉన్నత విద్యామండలి ఏమైనా మార్గదర్శకాలు ఇచ్చిందా..?

జవాబు: మంత్రి లోకేష్ ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం పాలన గాడి తప్పింది. దాన్ని దారిలో పెట్టాలని చెప్పారు. సమస్యలను పరిష్కరించుకుంటా.. లేని పక్షంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా. ఎక్కడ ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆలోచించి ఉన్నత విద్యామండలిలో చర్చించి ప్రతి అంశాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తా.

ఆర్‌యూలో చదువే లేదనే అభిప్రాయం ఉంది కదా?

జవాబు: అవును. చదువు లేదు .. అన్న ఈ వర్సిటీలో చదువు ప్రతి విద్యార్థికి అందేలా చూసి ఆ పేరును చెరిపేస్తాను. విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యకు పెద్ద పీట వేస్తా.. ఇప్పటి వరకు బోధన సిబ్బంది ఏం చేస్తున్నదీ తెలుసుకొని, ఇంకేం చేయాలో సూచిస్తా.

ఇక్కడ పదవులను కాపాడుకోవడమే లక్ష్యమైందనే అపవాదు ఉంది. ఎలా మారుస్తారు?

జవాబు: వాస్తవమే. ఇక్కడ పనిచేసిన ప్రొఫెసర్లు పదవులు కాపాడవడే లక్ష్యంగా ఉన్నారని, క్లాస్‌లకు వెళ్లడం లేదనీ ఫిర్యాదులు ఉన్నాయి. ఇకపై చదువుకు ప్రాధాన్యత ఇచ్చేలా వారిలో ప్రవర్తన తెచ్చేందుకు అవసరమైన తీరులో వారికి టార్గెట్లు నిర్దేశించి, ప్రతి విద్యార్థి చదువుకునేలా చూస్తా..! నిత్యం 10 నుంచి 20 మంది విద్యార్థులకు ఒక మెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా ఉత్తమ విద్యను అందిస్తా..

విద్యలో ఎలాంటి టార్గెట్లు పెట్టబోతున్నారు?

జవాబు: న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ లక్ష్యంగా పని చేస్తాం. అప్పుడే దేశ, ప్రపంచ స్థాయిలో మన రాయలసీమ యూనివర్సిటీకి పేరు ప్రఖ్యాతులు వస్తాయి. ఎక్కువ శాతం ఫ్యాకల్టీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉండటం వల్ల ప్రొఫెసర్ల స్థాయిలో వారు చొరవ తీసుకోవడం లేదు. ఈ తేడా లేకుండా చూసి విద్యలో మంచి ప్రావీణ్యం ఇచ్చేలా ఉన్నత విద్యమండలితో ప్రస్తావించి అవసరమైన చర్యలు తీసుకుంటా.

ఒక విద్యార్థే ఉన్న కోర్సుల మాటేంటి ?

జవాబు: ఎకనమిక్స్ విభాగంలో ఒక్క విద్యార్థి ఉన్నారు. ఎందుకు ఈ సమస్య ఉందో తెలుసుకుంటా. పీజీ కోర్సుల్లో 19 విభాగాల్లో కేవలం 360 మంది విద్యార్థులే ఉన్నారు. కొన్ని కోర్సులకు జీరో అడ్మిషన్లు ఉన్నాయని తెలిసింది. వాటిపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటా.

ఆర్‌యూ అంటేనే చెడ్డపేరు ఉంది. దాన్ని ఎలా అధిగమిస్తారు..?

జవాబు: రాయలసీమ యూనివర్సిటీ అంటేనే నిత్యం, దాడులు, ధర్నాలు, ఆందోళనలు, రాజకీయాలు ఉన్నాయనే అపవాదు ఉంది. చదువుకు ప్రాధాన్యమిస్తే ఇవి వాటంతట అవే సర్దుకుంటాయి. ప్రతి అంశాన్ని సున్నితంగా పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తా.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

- సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం
- నిరంతరం ఉచిత దర్శనం
- లక్ష లడ్డులు సిద్ధం
- మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి



మహానంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహానందిలో 8 రోజుల పాటు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపా రు. బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. లక్షలాది మంది భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాం తాల నుంచి వచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టుగానే సకల సదుపాయాలు కల్పించనున్నట్లు ఈవో తెలిపారు. అన్ని శాఖల సమన్వయ కృషితో ఉత్సవాలను వైభవంగా నిర్వహి స్తామన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై బుధవారం ఆంధ్రజ్యో తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈవో ఇలా అన్నారు...

ప్రశ్న: ఉత్సవాలు ఎప్పటి నుంచి ప్రారంభమవుతాయి?

జవాబు: ఈనెల 22 నుంచి శివరాత్రి వార్షిక ఉత్సవాలు క్షేత్రంలో ప్రారంభమవుతాయి. మార్చి 1 వ తేదీ రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం, పూర్ణాహుతితో ముగుస్తాయి.

ప్రశ్న: భక్తులకు ఏవిధమైన ఏర్పాట్లు చేస్తున్నారు?

జవాబు: లక్ష మంది భక్తులు ఈ ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు వచ్చే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగానే అదనపు క్యూలైన్లతో పాటు ఉచితంగా మినరల్ వాటర్ బాటిళ్ళు, మజ్జిగ, బిస్కెట్ల పంపిణీ, ఉచిత ప్రసాద వితరణ చేస్తున్నాం. భక్తులు ఎండ తట్టుకొనేందుకు పెండల్స్‌తో పాటు ప్రత్యేకంగా మ్యాట్లను ఏర్పాటు చేస్తాం. ప్రత్యేక క్యూలో నిరంతరం ఉచిత దర్శనం ఉంటుంది.

ప్రశ్న: సాధారణ భక్తులకు వసతి సౌకర్యాలు ఎక్కడ?

జవాబు: భక్తులు విశ్రాంతి తీసుకొనేందుకు దేవస్థానం పరిపాలన భవనం పక్కన ఉన్న పోచా విశ్రాంతి భవనంతో పాటు ఆలయ రెండో ప్రాకారంలో షామియానాలు ఏర్పాటు చేసాం. దేవస్థానం అన్నదాన సత్రంలో ప్రతి రోజు 2 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం. జిందాల్ సంస్థతో పాటు ఇతర సంస్థల సహకారంలో ఉచితంగా మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తాం.

ప్రశ్న: వైద్య సేవలకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

జవాబు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చే భక్తుల కోసం తిమ్మాపురం, గాజులపల్లి పీహెచ్‌సీ పరిధిలోని వైద్యాధికార్లు, సిబ్బంది ఆలయ పరిసరాల్లో రెండు ప్రదేశాల్లో ఉచితంగా వైద్య సేవలు అందిస్తారు. అలాగే రెడ్‌క్రాస్, జిందాల్ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా వైద్యసేవలు, మందులు అందజేస్తారు.

ప్రశ్న: లడ్డు, ప్రసాదాలు ఎన్ని సిద్ధం చేస్తున్నారు?

జవాబు: భక్తులకు ప్రసాదాల కొరత లేకుండా ఉండేందుకు లక్ష లడ్డులు సిద్ధంగా ఉంచాం. కోరినన్ని లడ్డు, ప్రసాదాలను అందజేస్తాం. రద్దీకి అనుగుణంగా లడ్డులు అందుబాటులోకి తెస్తాం.

ప్రశ్న: స్పర్శ దర్శనాలు, రుద్రగుండం కోనేరులో పుణ్య స్నానాలకు అనుమతిస్తారా?

జవాబు: శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 26 నుండి మార్చి 1 వరకు ప్రధాన గర్భాలయంలో భక్తులకు స్పర్శ దర్శనాలు నిలుపుదల చేస్తాం. మహానందీశ్వరుని నిజరూప దర్శనం ఏర్పాటు చేసాం. లింగోద్భవ పుణ్యకాలంలో కూడా రూ.100 టిక్కెట్టు కొనుగోలు చేసిన భక్తులను దర్శనానికి అనుమతిస్తాం. రుద్రగుండం కోనేరులో భక్తులకు పుణ్య స్నానాలకు అనుమతి లేదు. రెండో ప్రాకారం లోని పూల కోనేర్లల్లో భక్తులు స్నానాలు చేసుకొనే ఏర్పాటు చేసాం. మహిళలకు, పురుషులకు దుస్తులు మార్చుకొనేందు కోసం కోనేర్ల పరిసరాల్లో షెడ్లను ఏర్పాటు చేసాం.

ప్రశ్న: రథోత్సవం ఏర్పాట్లు ఎలా ఉన్నాయి?

జవాబు: ఈనెల 28న క్షేత్రంలో జరిగే మహా రథోత్సవానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసాం. ఇటీవలనే రథానికి కాళహస్తికి చెందిన ప్రత్యేక నిపుణులతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాం. రథోత్సవం ముందు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసాం, డ్రమ్స్ వాయిద్య కళాకారులతో ప్రత్యేక విన్యాసాలు ఏర్పాటు చేస్తున్నాం.

ప్రశ్న: భక్తుల కాలక్షేపం కోసం కార్యక్రమాలు?

జవాబు: భక్తుల కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక క కోలాటం, చెక్క భజన, హరికథలు, భజనలతో పాటు కూచిపూడి కార్యక్రమాలు ఉంటాయి. వీటిని తిలంకేంచుందుకు వీలుగా ఏర్పాటు చేశాం.

నమో నారసింహా..

వైభవంగా సుదర్శన హోమం, కల్యాణం



పూజలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకులు,



రాంసింగ్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న వేదపండితులు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్ర మైన అహోబిలంలో స్వాతి మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వామి ఉత్సవమూ ర్తులను అద్దాల మండపంలో కొలువు దీర్చి విశేష పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, తిరుమంజనం, కల్యాణం నిర్వహించారు. హోమ మండపంలో సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మురళీధరన్, ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ పాల్గొన్నారు.

చైర్మన్ రామ్‌సింగ్ పూజలు..

ఎగువ, దిగువ అహోబిలం క్షేత్రాల్లో ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రామ్‌సింగ్ విశేష పూజలు నిర్వహిం చారు. వేదపండితులు ఆలయ మర్యాద లతో స్వాగతం పలికా రు. దిగువ అహోబిలంలో కొలువైన ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లి అమ్మ వారిని ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనను సన్మానించి తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు.

శ్రీశైలంలో దుకాణాల వేలం టెండర్లను ఉపసంహరించుకున్నాం

సుప్రీంకోర్టుకు వెల్లడించిన రాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానంలో దుకాణాల వేలం టెండర్లను ఉపసంహరించుకున్నామని సర్వోన్నత న్యాయస్థానికి రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. హిందూ దేవాలయాల్లో అన్యమతస్తులకు దుకాణాల కేటాయింపుపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో 2003లోని ఉత్తర్వులను 2015లో రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ క్రమంలో శ్రీశైలం దేవస్థానంలో షాపులు నిర్వహిస్తున్న హిందూయేతరులకు దేవదాయ శాఖ నోటీసులు జారీ చేసింది. దుకాణ సముదాయాలను ఖాళీ చేయాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను కొందరు హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, దేవాలయాల్లో హిందూయేతురుల వల్ల భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారని, హిందూ దేవాలయాలను సంస్కరించేందుకు చట్టాలను సవరించే అధికారం తమకు ఉందని రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించింది. రాష్ట్ర ప్రభుత్వ వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. రాష్ట్ర ప్రభుత్వానికి సవరణలు చేసే అధికారం ఉందని పేర్కొంటూ 2019లో అన్యమతస్తుల పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. హైకోర్టు తీర్పును ఎండీ రబ్బానీ, ఎండీ రఫీ తదితరులు 16 జనవరి 2020న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మత ప్రాతిపదికన ఆలయ అద్దెదారులను ఖాళీ చేయాలని చెప్పడం సరికాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ క్రమంలో ఏపీ ప్రభుత్వం మరోసారి శ్రీశైలం దేవాలయంలో దుకాణాల కేటాయింపు కోసం టెండర్లను ఆహ్వానించింది. దీంతో బాధితులు మరోసారి సుప్రీంకోర్టులో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ బుధవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఇప్పటికే శ్రీశైలంలో టెండర్లను ఉపసంహరించుకున్నామని ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే, ఇది పదేపదే జరుగుతోందని, మరోసారి ఇలా జరగకుండా చూడాలని ధర్మాసనం సూచించింది. ఈ అంశంలో స్థానిక అధికారులకు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ ప్రభుత్వం తరపున న్యాయవాది తెలపడంతో ధిక్కరణ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు విధించిన స్టేను ధర్మాసనం మరోసారి పొడిగించింది.

మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో సమీక్ష



ఉద్యోగులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డా. శాంతికళ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కల్లూరు, నన్నూరు, హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సంభవించిన మూడు మాతృ మరణాలపై డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. 2024 జూలై, 2025 జనవరి, ఫిబ్రవరి నెలల్లో మాతృ మరణాల వివరాలను డీఎంహెచ్‌వో ఆడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది, ఆశా, ఆరోగ్య కార్యకర్త, వైద్యాధికారులు గర్భిణిలను త్వరగా గుర్తించి వారికి సరైన సమయంలో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో కర్నూలు జీజీహెచ్ గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుగుణ, ప్రియాంక, రంగస్వామి, అనస్థీషియా హెచ్‌వోడీ డాక్టర్ సుధీర్ కుమార్, డీఐవో డాక్టర్ నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.72 కోట్లతో బడ్జెట్

- ఆమోదం తెలిపిన మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు
- ప్రశాంతంగా ముగిసిన సమావేశం





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నీసా, పాల్గొన్న సభ్యులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ బడ్జెట్ సమావేశం బుధవారం కౌన్సిల్ హాల్‌లో చైర్ పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన జరిగింది. 2025-26 సంవత్సరానికి రూ.72 కోట్ల అంచనాతో బడ్జెట్‌ను కౌన్సిల్ ఆమోదించింది. 2024-25 బడ్జెట్‌తో పోలిస్తే 2025-26 బడ్జెట్ అంచనా శాతం తగ్గింది. 2024-25లో బడ్జెట్ వసూళ్లు రూ.4.8 కోట్లు ఉండగా 2025-26కు రూ.4.6 కోట్లుగా అంచనా వేసింది కౌన్సిల్. 2024-25లో నగదు, బ్యాంకు నిల్వ వెరసి ముగింపు నిల్వ రూ.25,70,96,000 ఉండగా 2025-26లో నిల్వ రూ.29, 18,70,000 ఉండవచ్చని అంచనా. అవుట్ సోర్సింగ్ జీతాలు రూ. 14 కోట్లు ఉండగా 2025-26లో రూ. 18 కోట్లు ఉండవచ్చని అంచనా. 2024-25లో ప్రజారోగ్య కార్యకలాపాలకు రూ.17,25,50,000 కోట్లు అంచనా వేయగా 2025-26కు 20,36,00,000గా ఉండవచ్చని అంచనా 2024-25లో రాబడి ఆదాయ శాతం 30.36% శాతం ఉండగా 20225-26లో 39.09% శాతంగా ఉండవచ్చని కౌన్సిల్ అంచనా వేసింది. బడ్జెట్ ఆమోదం అనంతరం కొందరు సభ్యుల ప్రశ్నలకు కమిషనర్ నిరంజన్ రెడ్డి సమాధానమిచ్చారు. వాస్తవ పరిస్థితులను వివరించారు. ఎలాంటి వాగ్వాదాలకు తావు లేకుండా కౌన్సిల్ సమావేశం ప్రశాతంగా ముగిసింది. సమావేశంలో వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, ఎంఈ గుర్రప్ప యాదవ్, డీఈ నాగభూషన్ రెడ్డి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ శాతం ఎందుకు తగ్గింది?: పడకండ్ల సుబ్రహ్మణం, కో ఆప్షన్ మెంబర్

2024-25లో రూ.82 కోట్లు ఉన్న బడ్జెట్ 2025-26 బడ్జుట్ రూ.72 కోట్లకు ఎందుకు తగ్గిందని కో ఆప్షన్ మెంబర్ సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఆర్థిక సూత్రాల ప్రకారం బడ్జెట్ అంచనా ప్రతి సంవత్సరం 10% పెరగాల్సి ఉందని, అయితే బడ్జెట్ శాతం తగ్గడానికి కారణమేంటో అధికారులు సమీక్షించుకోవాలన్నారు.

మున్సిపల్ ఆసుపత్రికి నిధులు పెంచాలి: కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా

దశాబ్దాల చరిత్ర ఉన్న చిన్న ఆసుపత్రి నిధులు పెంచాలని కో ఆర్షన్ మెంబర్ సలాముల్లా కోరారు. సిబ్బంది కొరతతో పరిసర ప్రజలకు సరైన వైద్యం అందటం లేదన్నారు. తక్షణమే అధికారులు ఆసుపత్రి సిబ్బందిని పెంచటంతో పాటు నిర్వాహణ నిధులు పెంచాలి.

దోమల నివారణ చర్యలు చేపట్టాలి: కౌన్సిలర్ ఖండే శ్యాంలాల్

పట్టణం ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నారని, నివారణ చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ ఖండే శ్యాంలాల్ కోరారు. ఫాగింగ్ తో పాటు స్ప్రేయర్ల సంఖ్య పెంచాలని, నాణ్యమైన రసాయనలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా డ్రైనేజీల్లో స్ప్రే చేయించాలన్నారు. దోమల నియంత్రణలో మున్సిపల్ వైఫల్యంపై ప్రజలు నిలదీస్తున్నారన్నారు. అధికారులు తక్షణమే దోమల నివారణకు కృషి చేయాలి.

పట్టణంలో పారిశుధ్యలోపం: కౌన్సిలర్ దేశం సులోచన

పట్టణంలో పారిశుధ్య లోపించిందని కౌన్సిలర్ దేశం సులోచన అన్నారు. దోమలతో పాటు పందులు, కుక్కలు, కోతులు బెడద ఇబ్బంది పెడుతోందని, నియంత్రించాలని కౌన్సిలర్ దేశం సులోచన కోరారు. పారిశుధ్య సిబ్బందికి యూనిఫాంతో పాటు కాస్మెటిక్స్ ఇంత వరకు ఇవ్వలేదన్నారు. పట్టణంలోని ఖాళీ స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్‌కు మున్సిపల్ ఉద్యోగులను ఉపయోగించటం ఏ మేరకు సబబు? అని ప్రశ్నించారు. తన వార్డు పరిధిలో కొందరు వ్యక్తులు ఎంక్రోచ్‌మెంట్లు చేస్తున్నారంటూ బెదిరిస్తున్నారన్నారు. టౌన్ ప్లానింగ్ శాఖకు చెడ్డ పేరు తెస్తున్నారన్నారు. టౌన్ ప్లానింగ్ శాఖ పనితీరు మెరుగు పర్చుకోవాలన్నారు. పార్కుల నిర్వహణ సరిగా లేదన్నారు. పార్కుల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని కోరారు.

నిర్వాహణ లోపం వల్లే బడ్జెట్ తగ్గింది: కమిషనర్

బడ్జెట్ శాతం తగ్గటానికి కారణం నిర్వాహణ లోపమే కారణమని, కౌన్సిల్ సభ్యుల సహకారంతో ఆ లోపాన్ని సవరించుకుంటామని కమిషనర్ నిరంజన్‌రెడ్డి చెప్పారు. దోమల బెడద నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు. కలెక్టర్ సైతం ఈ విషయంపై దృష్టి సారించారన్నారు. పారిశుధ్య సిబ్బందికి త్వరలో యూనిఫాంతో పాటు నూనె కాస్మెటిక్స్ పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ ఆసుపత్రి సమస్యలు తీరుస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పనూరులో బుధవారం 18 మందికి రూ. 15 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి, సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనారోగ్యాలకు గురై వైద్య చికిత్సల కోసం లక్షల రూపాయలు అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి పేదల కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో చేయూతనిస్తోందని అన్నారు. సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం అని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాపురం బాషా తదితరులు ఉన్నారు.

'గురురాజా' విద్యార్థుల ప్రతిభ

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సుచిర్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన సీవీ రామన్ యంగ్ జీనియస్ రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో గురురాజా విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల డైరెక్టర్ షేక్షావలి తెలిపారు. 6వ తరగతి విభాగంలో సరయు గోల్డ్‌మెడల్ సాధించారని, అలాగే ఇషాన్‌రెడ్డి, తారక్, తేజస్వితతో పాటు వైష్ణవి, రోహిత్, కార్తీక్, మహీధర్‌రెడ్డి, వరుణ్, ప్రణీత, దీక్షారెడ్డి, కీర్తనలు అత్యుత్తమ ప్రతిభ చూపి అవార్డులు పొందినట్లు తెలిపారు.

పట్టు వస్త్రాల సమర్పణ

మహానంది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రధాన ఆలయాలతో పాటు గరుడనంది, వినాయకనంది ఆలయాల్లోని స్వామి, అమ్మవార్లకు అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన గోరకాటి రఘునాథరెడ్డి, ప్రమీల దంపతులు పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే ధ్వజస్తంభాలకు, కలశాలకు వస్త్రాలను సమర్పించారు. బుధవారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో దాతల తరఫున తిరుపాల్‌రెడ్డి, సౌజన్య దంపతులు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డికి దేవతా వస్త్రాలను అందజేశారు. వీటిని శివరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా జరిగే స్వామి, అమ్మవార్ల అలంకరణలకు ఉపయోగిస్తామని ఆలయ వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు. ఏఈవో యర్రమల్ల మధు పాల్గొన్నారు.

'కనీస సౌకర్యాలు కల్పించాలి'



ఎంపీడీవోకు సమస్యలు తెలుపుతున్న నాయకులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధిహామీ పనుల వద్ద కనీస వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బరాయుడు, డేవిడ్ కోరారు. బుధవారం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట కూలీలతో కలిసి ధర్నా చేపట్టారు. నాయకులు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే ఎండలు అధికమయ్యాయని, కనీసం కూలీ రూ.300కు పైగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీడీవో దస్తగిరికి వినతిపత్రం అందజేశారు. సీనియర్ నాయకుడు రామచంద్రుడు పాల్గొన్నారు.

'ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలి'

పగిడ్యాల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పగిడ్యాల ఎస్సీ బాలుర హస్టల్‌లో విద్యార్థులకు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ చేపట్టిన చలో హస్టల్ కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల ఎస్సీ బాలుర వసతి గృహన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు.

'కళాశాల ఏర్పాటు చేయాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని వక్ఫ్‌బోర్డు స్థలంలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలని కోరుతూ ప్రజా పోరాట కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ప్రజా పోరాట కమిటీ నాయకులు రఫి, ఆకుమళ్ల రహీం, మహబూబ్‌బాషా మాట్లాడుతూ పట్టణంలో ఉర్దూ కళాశాల ఏర్పడి రెండేళ్లు అయినా నేటికి సొంత భవనం లేకపోవడం దారుణమన్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ వెంటనే కలుగజేసుకుని సమస్యను కళాశాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

'అవగాహన ఉండాలి'

కొత్తపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అవగాహన కలిగి ఉన్నప్పుడే క్షయ వ్యాధిని నిర్మూలించవచ్చునని ఎర్రమఠం పీహెచ్‌సీ వైద్యాధి కారి షబీర్ అన్నారు. బుధ వారం క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా ముసలిమడుగు జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో సూపర్‌వైజర్ చెరుకు రవి కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధిని తొలిదశలోనే ఉన్నప్పుడు గుర్తిస్తే వ్యాధి నిర్మూలించవచ్చున్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు ప్రసాద్, రాజేష్ హెల్త్ అసిస్టెంట్ రాజాగోపాల్, సామమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పెండింగ్‌లో ఉన్న 12 లక్షల వేతనదారుల లేబర్ బడ్జెట్ లక్ష్యాన్ని అధిగమించేందుకు ఏపీడీలు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. ఉపాధి హామీ లక్ష్యాల ప్రగతిపై కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి ప్రగతిపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పథకంలో వేతనదారులకు పనులు కల్పించి లక్ష్యాలను మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీడీలు క్షేత్రస్థాయిలో తిరిగి సంబంధిత ఫొటోలను ఆప్‌లోడ్ చేయాలన్నారు. వెలుగోడు, ఆత్మకూరు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి, కొలిమిగుండ్ల మండలాల్లో మాస్టర్ రిజిష్టర్‌లో రిపోర్టెడ్ వర్సెస్ జనరేటెడ్ అయిన వ్యత్యాసాలను విశ్లేషించి నివేదికలు అందజేయాలన్నారు. ఇంకా ప్రారంభించని 127 పశువుల షెడ్లను ప్రారంభించేందుకు పశు వైద్యులను సమన్వయం చేసుకొని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి పది ఫారం పాండ్స్ చొప్పున 489గ్రామ పంచాయతీలకు ఫార్మ్‌పాండ్స్ ప్రతిపాదనలు ఈ నెల 25లోపు సమర్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 29వేల ఎంఎస్ఎంఈ యూనిట్ల సర్వేను వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్లను, ఎంపీడీవోలను ఆదేశించారు. సమావేశంలో డ్వామా ఇన్‌చార్జి పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

- సున్నా పేదరికమే లక్ష్యంగా గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో పీ-4 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పీ-4సర్వే ప్రక్రియపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో సీపీవో వేణుగోపాల్, డీఎల్‌డీఓ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌కు సన్మానం



మంత్రిని సన్మానిస్తున్న ఇమామ్‌లు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి ఎన్ఎండ్ ఫరూక్‌ను నంద్యాల జిల్లా ఇమామ్‌ల సంఘం బుధవారం సన్మానించింది. నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఇమాంల సంఘం అధ్యక్షుడు హఫీజ్ అంజాద్ బాషా సిద్దికి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఐదువేల మంది ఇమాంలు, 5 వేల మంది మౌజన్ల గౌరవ వేతనం కోసం రూ. 45 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి ఫరూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నంద్యాల, కర్నూలు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీమతి సబిహా పర్వీన్ తదితరలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



బానకచర్లలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

పాములపాడు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నందికొటూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బానకచర్ల గ్రామంలో సర్పంచ్ ఆవుల జయసుధ, నారాయణరెడ్డి దంపతులతో కలిసి నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, హరినాధరెడ్డి, చంద్రశేఖర్, గోవిందు, ఆదిరెడ్డి, పూసలక్రిష్ణ, లింగేశ్‌గౌడ్, మోహన్‌గౌడ్, ఏసేపు, అలీసాహెబ్ అధికారులు పాల్గొన్నారు

మిడుతూరు: మిడుతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న హాస్పిటల్ సమాఖ్య అభివృద్ధి సమావేశానికి ఎమ్మెల్యే జయసూర్య హాజరయ్యారు. ముందుగా నూతనంగా ఏర్పాటు చేసిన దంత వైద్య శాలను, బిడ్డకు తల్లిపాలు ఇచ్చు గదులను ప్రారంభించారు. సర్పంచ్ జయలక్ష్మమ్మ, టీడీపీ సీనియర్ నాయకుడు మాండ్ర సురేంద్ర నాథ్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, శివరామి రెడ్డి, రామస్వామి రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, సర్వోత్తమ రెడ్డి, నరసింహగౌడు, షబ్బు బాషా, రమణ రెడ్డి, సోఫీ సాహెబ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- అంగన్‌వాడీలు బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే గిత్తా జయ సూర్య అన్నారు. బుధవారం మండల కేంద్రం మిడుతూరు గ్రామంలోని ఏపీ మాడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు.

నందికొట్కూరు: ప్రతి మహిళ స్వయం ఉపాధితో లక్షాధికారులుగా ఎదగాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. బుధవారం నందికొట్కూరులోని శ్రీ శక్తి ఉపాధి హామీ భవనములో స్వయం సహాయక సంఘాల మహిళలకు వ్యవస్థాపక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డి అధికారులు పాల్గొన్నారు.

'డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి'



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీకి వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని కోరుతూ ఏఐవైఎఫ్ నాయకులు డీఆర్వో రామునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాము మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ లేక లక్షలాది మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్‌లలో ఫీజులు చెల్లించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు పృథ్వీకుమార్, హరికృష్ణ, దివాకర్, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌డీపీవో



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌డీపీవో

మహానంది/నంద్యాల క్రైం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సిబ్బంది నిరంతరం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ఎస్‌డీపీవో మంద జావళి అల్ఫోన్స్ ఆదేశించారు. నంద్యాల సబ్ డివిజన్ మహానంది పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతారామాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ పికెట్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పికెట్ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి గ్రామ స్థితిగతులను తెలుసుకున్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వస్తే వారిపై నిఘా వేసి ఉంచాలన్నారు. గ్రామంలో అల్లర్లు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.

'ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి'

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్, ఇన్‌చార్జి డీఈవో ప్రేమంత్ కుమార్, డిప్యూటీ డీఈవో శంకర ప్రసాద్ సూచించారు. బుధవారం బండిఆత్మకూరు హైస్కూల్‌లో అంగన్‌వాడీల శిక్షణా కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఈవో సంతజూటూరు హైస్కూల్‌లో పదో తరగతి పిల్లలతో మట్లాడారు. సూపర్‌వైజర్ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా'

ఆత్మకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని క్షేత్ర పరిధిలో మత్తు పదార్థాల వినియోగం లేకుండా ఎక్సైజ్‌శాఖ తరుపున ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ వి.రాముడు పేర్కొన్నారు.బుధవారం ఆత్మకూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 19 నుంచి 28వ తేది వరకు శ్రీశైలం పరిధిలోని దోమలపెంట, హెలిప్యాడ్, శిఖరం, పాలధార - పంచధార తదితర ప్రదేశాల్లో నాటుసారా, మద్యం, గంజాయి వంటి అమ్మకాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం శ్రీశైలంలోని కాటేజ్-60లో తాత్కాలిక ఎక్సైజ్ స్టేషన్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కాగా మత్తు పదార్థాల నియంత్రణకు 70 ఒక అడిషనల్ సూపరిండెంట్, ఆరుగురు సీఐలు, 8మంది ఎస్ఐలు, 11 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 24 మంది కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది చొప్పున మొత్తం మంది విధుల్లో ఉంటారని చెప్పారు. పండుగ రోజుల్లో సున్నిపెంట పరిధిలోని మద్యం దుకాణాలను కూడా మూసివేయనున్నట్లు తెలిపారు. ఇదిలావుంటే ఎక్కడైనా నాటుసారా, మద్యం, గంజాయి వంటి విక్రయాలు జరుగుతున్నట్లయితే 9390943271 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం: సీపీఎం



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సామాన్యులకు అన్యాయం జరిగిందని సీపీఎం జిల్లా నాయకులు ఏసురత్నం కోరారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక గౌడ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో అప్పుల నిధులను సమకూర్చి మౌలిక సదుపాయాలు, సామాజిక రంగాలను, పౌర సేవలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేయడం సరికాదన్నారు. అప్పుల రూపంలో నిధుల విధానాన్ని తీసుకొచ్చి రాష్ట్రాలకు కూడా బలవంతంగా రుద్దడం విడ్డూరంగా ఉందని అన్నారు. నాయకులు రణధీర్, నరసింహానాయక్, స్వాములు, మాబాషా, వీరన్న, కిరణ్, గణపతి, మల్లయ్య తదితరులు ఉన్నారు.

'భారతీయులను సంకెళ్లతో తరలించడం దారుణం'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది భారతీయలను అక్రమ వలసదారుల నెపంతో సంకెళ్లు వేసి యుద్ధ విమానాల్లో భారత్‌కు తరలించటం దారుణమని డీవైఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా చర్యను నిరసిస్తూ బొమ్మల సత్రం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఘనంగా శివాజీ జయంతి



నంద్యాలలో శోభయాత్రలో పాల్గొన్న హిందువులు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో హిందూ, ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు కొశెట్టి చంద్రశేఖర్, రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్, హిందూ ధర్మ సంరక్షణ వేదిక, జిల్లా గోసేవాదళ్, నంద్యాల హిందూ సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే విష్ణువర్ధన్‌రెడ్డి, పోలేపల్లి సందీప్, ఇనుగూరిరమేష్, మేడా మురళి, హిందుసోదరులు తదితరులు పాల్గొన్నారు. నంద్యాలలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ కార్యకర్తలు బాలముని, నంద్యాల రూరల్ అధ్యక్షుడు గురుబ్రహ్మ, పట్టణ నాయకులు చల్లా మధు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ హేయంత్ రెడ్డి, అధ్యాపకులు మోహన్‌రావు, శ్రావణికుమారి, రత్నరామిరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వాతి నక్షత్ర వేడుకలు

నంద్యాల కల్చరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): నంద్యాల తెలుగుపేటలో వెలసిన మద్దులేటి లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి సందర్భంగా స్వాతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకలలో భాగంగా స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు, పూలమాలలతో అలంకరించి నైవేద్యం సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీరామమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో జాబ్ మేళా

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థలో బుధవారం జాబ్ మేళా జరిగింది. ఆర్టీసీ లో డ్రైవర్లు/శ్రామిక్‌లుగా శిక్షణ పొందిన 80 మంది అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనగా 52 మంది అర్హత సాధించారు. ఎంపికైన అభ్యర్థులు నవతా ట్రాన్స్‌పోర్టులో విధులు నిర్వహిస్తారు. జాబ్ మేళాలో ఆర్‌టిసి డిఎం గంగాధర్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి, నవత ట్రాన్స్‌పోర్టు ఉద్యోగి శివప్రసాద్ తదీతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నందికొట్కూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 8వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. ఈనెల 8వ తేదీన సాయంత్రం పట్టణానికి చెందిన టైలర్ ముత్తు జావలి ఇంటికి వెళ్తున్న సమయంలో పటేల్ సెంటర్‌లో నందికొట్కూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. దీంతో వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసు స్టేషన్ ఏఎస్ఐ రామచంద్రుడు తెలిపారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలో విజిలెన్స్ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ వ్యవసాయాధికారి విశ్వనాథ, విజిలెన్స్ కానిస్టేబుల్ ప్రవీణ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు నేతృత్వంలో దాడులు చేశారు. బాలాజీ కాంప్లెక్స్‌లోని సంజీవరెడ్డి ఏజన్సీస్ షాపులో యూరియా ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్ముతున్నారని, రూ.16,523ల విలువ కల్గిన 62 బస్తాల యూరియాను సీజ్ చేశారు. శివసంతోషరెడ్డి ఏజన్సీలో 16:16:16 ఎరువులను స్థానిక హోల్‌సేల్ డీలర్ల నుంచి కాకుండా వేరే జిల్లాల నుంచి తెప్పించుకుని విక్రయిస్తుండగా గుర్తించి రూ.1,82,625 విలువ కలిగిన 135 బస్తాలను సీజ్ చేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చెరువు నీటిని కుంటకు మళ్లించాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని వెంకటనాయునిపల్లె గ్రామ నీటి కుంటకు చెరువు నీటిని పైపులైన్ల ద్వారా మళ్లించాలని సర్పంచ్ చంద్రశేఖర్ నాయుడు కోరారు. బుధవారం ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ గ్రామంలో భూగర్భజలాలు తగ్గిపోయి తాగునీటి ఎద్దడి ఏర్పడుతున్నదన్నారు. ఉడుములపాడు చెరువు నీటిని పైపులైన్ ద్వారా గ్రామంలోని కుంటకు తరలిస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆర్‌కే బుల్స్ ప్రథమం

చాగలమర్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి రాతిదూలం పోటీల్లో బాపట్ల జిల్లా వేటపాలెంకు చెందిన ఆర్‌కే బుల్స్ ప్రథమ స్థానంలో గెలుపొందాయి. వీరికి మొదటి బహుమతి 125 సీసీ ద్విచక్రవాహనాన్ని దాత చక్రం షబ్బీర్ అందజేశారు. రెండో బహుమతి నంద్యాల జిల్లా పెద్దకొట్టాల కేశవరెడ్డి వృషభాలకు 100 సీసీ ద్విచక్రవాహనాన్ని దాతలు మోహన్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి అందజేశారు. అలాగే దాతలు షేక్. మహమ్మద్‌రఫి, వెంకటమోహన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాస రెడ్డి, రఫి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో నిద్ర

డోన్ రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బాలికల సంక్షేమ హాస్టల్‌లో బుధవారం రాత్రి సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చింతామణి విద్యార్థినులతో కలిసి నిద్ర చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలని ఆకాంక్షించారు. హాస్టల్ వార్డెన్ లక్ష్మిబాయి, సిబ్బంది ఉన్నారు.

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

బనగానపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు గుర్తింపు సంఖ్యకు నమోదును చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులను కోరారు. బుధవారం బనగానపల్లె మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో యాగంటిపల్లె గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు వేసిన పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉద్యానవనశాఖ అధికారి రఘురన్, పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బ్రహ్మానందారెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పెట్టుబడులు తగ్గించుకునేలా కృషి చేయాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రైతులు పెట్టుబడులు తగ్గించుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాగంటిపల్లె కృషి విజ్ఞానకేంద్రం హెడ్ ధనలక్ష్మి కోరారు. బుధవారం కేవీకేలో నిర్వహించిన అగ్రి ఇన్పుట్ డీలర్స్ దేశీ డిప్లొమా కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు ఆత్మపీడీ రత్నప్రసాద్, నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, కర్నూలు జిల్లా ఆత్మ డీపీఎం శ్రీలత తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని డిప్లొమా పొందిన వారికి పట్టాలు అందించారు. కార్యక్రమంలో దేశీప్రోగ్రాం ఫెసిలిటేటర్ విశ్వనాథ్‌రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారి మధుమతి పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

బనగానపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : భూములు కోల్పోయిన రైతులకు రాంకో సిమెంట్ యాజమాన్యం న్యాయం చేయాలని రామిరెడ్డిపల్లె, కేశవనాయునిపల్లె రైతులు కోరారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు మాట్లాడుతూ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు మంచాల మహేశ్వరరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సురేఖ, రంగనాయకులు, శ్రీను, బజారు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన ప్రక్రియలో సమూల మార్పు

రుద్రవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యసన ప్రక్రియలో సమూల మార్పులు జరుగుతాయని స్టేట్ కమిటీ కోఆర్డినేటరు వెంకటేశ్, జిల్లా సైన్స్ కోఆర్డినేటరు సుందరయ్య తెలిపారు. బుధవారం రుద్రవరం ఆదర్శ పాఠశాల ఏటీఎల్ ల్యాబ్‌ను ఏటీఎల్ హబ్ స్కూల్ ఇన్‌చార్జి నరసింహతో కలిసి వారు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ల్యాబ్ ఇన్‌చార్జి జాహిద్, వైస్‌ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, పీడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

దొర్నిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని బుర్రారెడ్డిపల్లె, రామచంద్రాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థి ప్రతిభ

రుద్రవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి క్రీడల్లో మెడల్స్ సాధించిన స్పందనను ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, సిబ్బంది బుధవారం అభినందించారు. ఈ నెల 13 నుంచి 15వతేదీ వరకు మహారాష్ట్రలోని నాశిక్‌లో జరిగిన జాతీయస్థాయి జంప్‌రోప్ పోటీలో పాల్గొని మెడల్స్‌ను సాధించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సురేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గొప్ప పాలనాదక్షుడు ఛత్రపతి శివాజీ



చాగలమర్రి చెన్నకేశవ ఆలయంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎస్‌ఎఫ్, హిందూ సంఘ నాయకులు

బనగానపల్లె, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల వద్దకు పాలన తీసుకుపోయిన గొప్ప పాలనాదక్షుడు ఛత్రపతి శివాజీ అని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ మహమ్మద్‌గౌస్ అన్నారు. బుధవారం బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరడ్డి, సీతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో బుధవారం అభినవ శంకరానందస్వామి, ఎస్‌ఎస్‌ఎఫ్ సభ్యులు, హిందూ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, హిందూ సంఘం నాయకులు జయదేవరెడ్డి, సల్లానాగరాజు, గుత్తి నరసింహులు, శివశంకర్, రవీంద్రారెడ్డి, దస్తగిరి, మహేంద్ర, రవిశంకర్‌రెడ్డి, రాఘవ, పుల్లయ్య, శివస్వాములు, నరసింహస్వామి పాల్గొన్నారు.

ప్యాపిలి: స్థానిక సరస్వతి శిశుమందిరంలో బుధవారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడించే వారేరీ ..?

- వేధిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుల కొరత
- గ్రామీణ క్రీడాకారులకు కరువైన ప్రోత్సాహం
- పలు పాఠశాలల్లో మైదానాల కరువు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో చురుకైన పాత్ర పోషించాలంటే వారి మానసిక స్థైర్యాన్ని పెంపొందించే క్రీడలు అత్యంత అవసరం. అయితే పాఠశాలల్లో ఆటలు ఆడించే వ్యాయామ ఉపాధ్యాయులు కరువయ్యారు. కొలిమిగుండ్ల మండలంలో పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒకటి మోడల్ స్కూల్, ఒకటి కస్తూర్బా పాఠశాల, ఒకటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నది. అయితే ఏ పాఠశాలకు ఒక్క వ్యాయామ ఉపాధ్యాయుడు లేడంటే క్రీడల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థమవుతుంది. వ్యాయమ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు ఆడుకోవాలని ఉన్నా ఆడించే వారు లేని పరిస్థితి నెలకొంది. అంకిరెడ్డిపల్లె, మోడల్ స్కూల్, తిమ్మనాయినిపేట ఉన్నత పాఠశాల మినహా ఏ పాఠశాలల్లో కూడా పీఈటీలు లేకపోవడం గమనార్హం. ఇక ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు సైతం కరువయ్యాయి. కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల మినహా ఏ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల్లో క్రీడలకు ఉపయోగపడే మైదానం కనిపించడం లేదు. కొన్ని పాఠశాలల్లో మైదానాలు ఉన్నా వాటిని అభివృద్ధి చేసే దిక్కులేదు. మైదానంలో పిచ్చి మొక్కలు, బండరాళ్లు, మట్టి దిబ్బలు, ప్రహరీ గోడ లేని దయనీయ పరిస్థితి. దీంతో నైపుణ్యం కలిగిన ఎంతో మంది క్రీడా విద్యార్థులు మరుగున పడే దైన్యస్థితి నెలకొంది.



బెలుం ఉన్నత పాఠశాలలో అస్తవ్యస్తంగా ఉన్న క్రీడా మైదానం



గులక రాళ్లు, పిచ్చి మొక్కలతో కొలిమిగుండ్ల జూనియర్ కళాశాల మైదానం

నాడు-నేడు, ఆడుదాం ఆంధ్ర ..ఆర్భాటమే

గత వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో క్రీడా అవసరాల కోసం ఒక్క రూపాయి నిధులు కేటాయించిన పాపాన పోలేదు. నాడు-నేడు, ఆడుదాం ఆంధ్ర పేరుతో ఆర్భాటం చేయడం తప్ప చేసిందేమీలేదన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపించాయి. పాఠశాలల్లో క్రీడా పరికరాలను అందుబాటులో ఉంచలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా పాఠశాలల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేయించి, వ్యాయమ ఉపాధ్యాయులను నియమిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పాలకుల దృష్టికి తీసుకెళ్లాం



క్రీడా మైదానం బాగు చేయాలని అధికారులకు తెలిపాం. పలువురు ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసు వెళ్లాం. ఇటీవలే రామ్‌కో సిమెంట్ పరిశ్రమ అధికారులను కలిసి క్రీడా మైదానం తయారు చేయాలని విజ్ఞప్తి చేశాం. సానుకూలంగా స్పందించారు.

- బి.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆడించేవారు లేరు



నాతో పాటు కాలేజీలో ఎంతో మంది విద్యార్థులకు ఆడుకోవాలని ఉంది. అయితే క్రీడా ఉపాధ్యాయులు(పీడీ) అందుబాటులో లేరు. దీంతో మమ్మల్ని ఆటల్లో ప్రోత్సహించే వారు లేక, ఆటల్లో వెనుకబడి పోతున్నాం.

- వి.నారాయణాచారి, ఇంటర్ విద్యార్థి

క్రీడా మైదానాలను బాగు చేయించాలి



కళాశాలలో క్రీడా మైదానం ముళ్ల కంపలు, బండరాళ్లతో నెలకొని ఉండటంతో తరగతి గదుల నుండి బయటికి రాలేక పోతున్నాం. ప్రభుత్వం చర్యలు తీసుకొని క్రీడా మైదానాలు బాగుచేసి, పీడీలను నియమించాలి.

- డి.మౌనిక, ఇంటర్ సెకండియర్ విద్యార్థి

కార్పొరేట్ తరహాలో ఆస్పత్రి అభివృద్ధి

- రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- వైద్య పరికరాలు అందజేత

అవుకు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అవుకు పట్టణంలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కార్పొరేట్ ఆసుపత్రి తరహాలో అభివృద్ధి చేస్తానని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మంత్రి సొంత నిధులు వెచ్చించి తెప్పించిన రూ. 25 లక్షల విలువగల వైద్య యంత్ర పరికరాలను డాక్టర్లకు అందజేశారు. అంతకు ముందు ఆస్పత్రి వద్ద టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ పక్కీరరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం హాస్పిట్ సర్వీసెస్ డిస్ట్రిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ జఫ్రుల్లా, ఆసుపత్రి సూపరింటెండెంట్ అభినయ్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పిదాల వల్ల ఆసుపత్రులకు సరైన వైద్య పరికరాలు అందలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యం, విద్య, వ్యవసాయరంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మూడు నెలల క్రితం తాను ఆసుపత్రి విజిటింగ్‌కు వచ్చిన సమయంలో రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలంటే వైద్య యంత్ర పరికరాలను సమాకూర్చాలని డాక్టర్లు తన దృష్టికి తెచ్చారన్నారు. దాంతో తన సొంత నిధులు రూ. 25 లక్షలు వెచ్చించి వైద్య యంత్ర పరికరాలను అందించానన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి డాక్టర్ల బృందం కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణనాయక్, రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ కోఆపరేటివ్ డైరెక్టర్ అరుణ్‌కుమార్‌నాయక్, టీడీపీ నాయకులు మద్దిలేటిగౌడు, దంతెల రమణ, తిక్కన్న, వెంకటరాముడునాయక్, మారం మహేశ్వరరెడ్డి, ఆకుల నాగిరెడ్డి, ఇస్మాయిల్‌ఖాన్, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.



వైద్య పరికరాలను అందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బాల్య వివాహాలను అరికట్టండి: ఆర్డీవో

డోన్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ బాల్య వివాహాలను అరికట్టాలని డోన్ ఆర్డీవో నరసింహులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్‌లో డివిజన్ స్థాయిలో సీడీపీవో శంషాద్ బేగం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ బాల్య వివాహాలు అరికట్టడంలో అధికారులతో పాటు ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని తెలిపారు. విద్యార్థినులు చదువును మధ్యలో ఆపివేస్తే విద్యాశాఖ అధికారులు వివరాలు సేకరించాలన్నారు. మరలా చదువుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల మున్సిపల్ కమిషనర్లు ప్రసాద్‌గౌడు, హరిప్రసాద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ హనీఫ్, డిప్యూటీ డీఈవో వెంకట్రామిరెడ్డి, డోన్ అర్బన్ సీఐ ఇంతియాజ్‌బాషా, డోన్,ప్యాపిలి, బేతంచెర్ల, తహసీల్దార్లు నాగమణి, భారతి, ప్రకాష్‌బాబు, ఎంపీడీవోలు వెంకటేశ్వరరెడ్డి, ఫజుల్ రెహిమాన్, శ్రీనివాసులు, ఎంఈవోలు ప్రభాకర్, రామనర్సప్ప, రూరల్ ఎస్ఐ మమత, సూపర్‌వైజర్లు పద్మ, మహేష్, పరమేశ్వరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆసుపత్రిలో సిబ్బందితో పాటు ఎక్విప్‌మెంట్ కొరత ఉందని వైద్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సీఎంతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే అఖిలప్రియ వైద్యులకు సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ :

ఉయ్యాలవాడ మండలం ఆర్ జమ్ములదిన్నె గ్రామానికి చెందిన వంగల వెంకట లక్ష్మమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ బాధితురాలి కుటుంబసభ్యులకు బుధవారం ఆళ్లగడ్డలో పంపిణీ చేశారు. ఆపదలో సహాయం అందిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



ఆళ్లగడ్డలో వైద్యులతో సమావేశమైన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఘనంగా పెద్దమ్మ దేవర ఉత్సవం

- పూజల్లో పాల్గొన్న కర్నూలు ఎంపీ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

ప్యాపిలి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలేబాదు గ్రామంలో బుధవారం గ్రామ దేవతలు పెద్దమ్మ, మారెమ్మ దేవర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ తనయుడు కేఈ రుద్రప ణిగౌడు దేవరలో పాల్గొని అమ్మవార్లకు వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టీడీపీ నంద్యాల పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అలేబాదు పరమేష్, సీమ సుధాకర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, ఆర్ఈ నాగరాజు, ఖాజాపీర్, శ్రీకాంత్, కుమ్మరి సుధాకర్, మల్లికార్జున, హరికుమార్, బాలచంద్రశేఖర్, పెద్దరాజు తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సుజాతమ్మ

బ్యాంకర్లతో ఎంపీడీవో సమావేశం

సంజామల, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయలో బుధవారం ఎంపీడీవో సాల్మన్ బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ రుణాలపై చర్చించారు. కార్యక్రమంలో సంజామల కెనరా బ్యాంకు మేనేజర్ తరున్ కుమార్, ఆయా బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

శిరివెళ్ల: కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన దరఖాస్తులను బ్యాంకు అధికారులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప , బ్యాంకు అధికారులు వెల్లడించారు.

ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుమానుపల్లె గుండం ఆంజనేయస్వామి వద్ద నూతనంగా నిర్మించిన దక్షిణామూర్తి, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఇటిక్యాల బాలిరెడ్డి, శివస్వామి, సుధాకరరెడ్డి, కొండయ్యగౌడు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మాదకద్రవ్యాల జోలికి పోతే చర్యలు

- ఎస్ఐ హరిప్రసాద్, ఆళ్లగడ్డ రూరల్



చాగలమర్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్ అన్నారు. ఎక్కడైన అనుమానితులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ఎస్ఐ మాట్లాడారు.

ప్రశ్న: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీలు చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నాం.

ప్రశ్న: మాదకద్రవ్యాలు, గంజాయి విద్యార్థులు తాగుతున్నట్లు సమాచారం?

జవాబు: వదంతులు వస్తున్నాయి తప్పా ఎక్కడ అటువంటి కార్యక్రమాలు జరగలేదు. పట్టుబడితే వారి జీవితాలు వారే నాశనం చేసుకున్నట్లవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలి.

ప్రశ్న: పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా?

జవాబు: చట్టానికి లోబడి పని చేస్తాం. మాకు ఎక్కడా రాజకీయ ఒత్తిళ్లు లేవు. పోలీసులు చెబితే అన్ని పార్టీల వారు సహకరిస్తున్నారు.

ప్రశ్న: పాఠశాలలు, కళాశాలల వద్ద ఈవ్‌టీజింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పాఠశాలలు, కళాశాలల వద్ద ప్రత్యేక నిఘా పెట్టాం. టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. వీటిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: ఫ్రెండ్లి పోలీసులపై మీ సమాధానం?

జవాబు: ప్రజలు సమస్యలతో వస్తారని, వారిని కూర్చొబెట్టి చర్చించిన తరువాత సమస్య అడిగి తెలుసుకొని పరిష్కరిస్తాం. లేదంటే ఫలాన కార్యాలయానికి వెళ్తే మీ సమస్య పరిష్కారమవుతుందని వారికి అర్థమయ్యే విధంగా వివరించి చెబుతాం.

సోలార్‌ను ఏర్పాటు చేసుకోండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): సోలార్‌ను ఏర్పాటు చేసుకుంటే కరెంటు బిల్లు తక్కువ వస్తుందని విద్యుత్ శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జూనియర్ ఇంజనీర్ కుషిదర్, లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, లైన్‌మెన్లు ఉచ్చారెడ్డి, ఆపరేటర్ సాయి పురుషోత్తం, సోలార్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ శ్రమ్‌లో నమోదు చేయండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులందరినీ ఈశ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సీపీఎం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎస్ఏ చిన్న రెహిమాన్ సూచించారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈశ్రమ్‌లో పేరు నమోదు చేసుకున్న వారికి సంక్షేమ పథకాలు, సామాజిక భద్రత పథకాలు అందుతాయన్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లకు ఫౌండేషన్ లెవెల్ శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌కలాం, హైస్కూల్ హెచ్‌ఎం హుసేనయ్య, రీసోర్స్ పర్సన్స్, అంగన్‌వాడీ అధికారులు పాల్గొన్నారు.

చాగలమర్రి: అంగన్‌వాడీ కార్యకర్తలు జ్ఞానజ్యోతి కోర్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్పీ శివశంకర్‌రెడ్డి కోరారు. బుధవారం చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో న్యామతుల్ల, జ్ఞానమాస్టర్ జయరామిరెడ్డి, సూపర్‌వైజర్ సుశీల, డీఆర్పీలు మాబుహుసేన్, గౌస్ పాల్గొన్నారు.

రేపు బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాలయంలో బీసీ రుణాలకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వరప్రసాదరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 11గంటలకు దరఖాస్తుదారులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

కంబగిరిస్వామి ఆలయం పున:ప్రారంభం

అవుకు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి ఆలయం బుధవారం పున:ప్రారంభమైంది. దాదాపు రూ. రెండు కోట్ల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవంలో ఈవో నాగిరెడ్డి ప్రోటోకాల్ పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో ప్రజల నుంచి తీవ్ర స్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ నాయకుడు ఆలయ ధర్మకర్త చల్లా సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పించారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

రుద్రవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వం నియమించిన మెనూ పాటించాలని ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్య అన్నారు. బుధవారం ఆయన రుద్రవరంలో మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు వస్తే చర్యలు తప్పవన్నారు.

బీసీ రుణాల దరఖాస్తుల పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ రుణాల కోసం యువతీ యువకులు చేసుకున్న దరఖాస్తులకు బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బ్యాంకు అధికారుల సమక్షం లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేస్తామని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, ఎఫ్‌వోలు చంద్ర ఓబుళరెడ్డి, ఉసేన్‌వలి, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవమూర్తులకు పులికాపు

రుద్రవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : పార్వేట ఉత్సవమూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరదస్వాములకు పులికాపు బుధవారం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలను రాజశేఖర్ రావు, సుజాత దంపతులు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సంతానం, శ్రీనివాసరావు, కళ్యాణమ్మ దంపతులు, మురళీధర్‌రావు, జానకమ్మ దంపతులు, రాఘవేంద్రరావు, పూర్ణమ్మ దంపతులు, వీఆర్వో రవీంద్ర, గ్రామ కార్యదర్శి, శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీ-4 సర్వే ప్రారంభం

డోన్ టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి):

పట్టణంలో పీ-4 సర్వేను గురువారం నుంచి నిర్వహిస్తున్నట్లు డోన్ డీఎల్‌డీవో నరసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీ-4 ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యంపై సూక్ష్మతరహా, కుటీర పరిశ్రమల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సర్వే మార్చి 3వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.